
**"సూర్యం రాత్రి ఉరిబోసుకొని చనిపోయాడట."**

**రాత్రి డ్యూటీ చేసి, ఇంటికి వచ్చాక చొక్కాని స్టాండ్‌కు తగిలిస్తున్నప్పుడు విన్పించాయా మాటలు.**



విస్మయంగా, వినరానిది విన్నట్లుగా వెనక్కి తిరిగి చూశాను. గుమ్మం దగ్గర కాఫీ కప్పుతో నిల్చుని, పాలిపోయిన మొహంతో నాకేసి చూస్తోంది ప్రమీల.

"ఈ తెల్లవారు జామున రాత్రి పెట్రోలింగ్ చేసిన వాళ్లు మన ఇంటి ముందు మాట్లాడుకోవటం వినిపించింది. కాఫీ తాగేసి ఓసారి వెళ్లి రండి." చేతికి కప్పు అందివ్వబోయింది.

విడిచేసిన చొక్కాని మళ్లీ ఒంటికి తగిలించుకొని, ఇంట్లోంచి బయల్దేరబోయాను. 'కాఫీ తాగేసి వెళ్లమంటున్న' ప్రమీల మాటల్ని పట్టించుకోకుండా గడప దాటాను.

ఇది నిజమేనా! సూర్యం ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడా! నే నింతకాలం భయపడుతోంది నిజమయ్యిం దన్నమాట.

మా ఇంటికి మరో రెండు వీధుల వెనకనున్న సూర్యం ఇంటికి దాదాపుగా పరిగెడుతున్నాను.

వీధిలో జనం అక్కడక్కడా నిలబడి, రహస్యంగా గుసగుస లాడుకుంటున్నట్లు చెవులు కొరుక్కుంటున్నారు.

బహుశా సూర్యం ఆత్మహత్య గురించే కాబోలు!

ఇన్నాళ్లూ నేను సూర్యానికి నూరిపోసిన ధైర్యం అంతా ఏమయిపోయింది? జీవితాన్ని ఎదుర్కోలేని సూర్యం బలహీనతతో ఈ రకం చావుని ఆశ్రయిస్తాడన్న శంక అప్పుడప్పుడూ నాకు కలగక పోలేదు.

అయినా ఎంతకాలమని మనిషి వెన్నంటి కాపాడాలని ప్రయత్నిస్తాం! సూర్యం ఇక కన్పించడన్న ఆలోచన రాగానే ఒక్కసారిగా ఒళ్లంతా జలదరించింది. చివ్వున కళ్లల్లో నీరుబికింది.

మానవునికున్న ఆస్తిలో కెల్లా అతి ప్రియమైనది జీవితమే! జీవితాన్ని గడిపే అవకాశం మనిషికి ఒకేసారి లభిస్తుంది.

అలాంటి జీవితాన్ని చేజేతులా బలిచేసుకున్న సూర్యం తనంతకు తానుగా ఆత్మహత్య చేసుకున్నాడా! పురిగొల్పిన పరిస్థితులు ఎంత భయంకరమైనవో నాకూ తెలిసినా... సమస్యలకి భయపడి జీవితాన్ని అంతం చేసుకునే మనుషులంటే నా కెందుకో అసహ్యం.

కానీ సూర్యం విషయంలో అసహ్యం చోట ఆవేదన నిండుకుంది. సూర్యానిదీ, నాదీ ఒకే రకం బతుకు. నా సహవాసం చేసి కూడా అతనిలోకి ఈ బేలతనం ఎలా ప్రవేశించిందో... అర్థం కావటం లేదు.

సూర్యం ఇంటి ముందు జన ప్రవాహం. మనుషుల్ని తప్పించుకుంటూ లోపలికి దూసుకెళ్లాను. వరండాలో సూర్యాన్ని పడుకోబెట్టారు. ఆ దృశ్యం చూడలేకపోయాను. గుండెల్లోంచి ఒక్కసారిగా ఎగదన్నుకొచ్చిన దుఃఖాన్ని దిగమింగుకోవడం నా వశం కాలేదు. సూర్యం కాళ్ల దగ్గర కూలబడిపోయాను.

"నే నొచ్చాను సూర్యం... నీ వంశీని." నా కంఠం వణుకుతోంది.

పొగిలి పొగిలి ఏడుస్తూనే సూర్యాన్ని తేరిపార చూశాను.

"ఇక సెలవు మిత్రమా! జీవితంలో గెలవలేకపోయాను. ఓటమి నంగీకరిస్తూ ఈ లోకం నుండి నిష్క్రమిస్తున్నాను." సూర్యం నాతో మాట్లాడుతున్నట్టు అన్పిస్తోంది.

కొద్ది దూరంలో సూర్యం పిల్లలిద్దరూ నాన్న కేమయిందో తెలీక, ఎందుకలా పడుకోబెట్టి చుట్టూ మూగి ఏడుస్తున్నారో అర్థం చేసుకోలేక అందరి వంకా అమాయకంగా ఆశ్చర్యంతో చూస్తున్నారు.

సూర్యం భార్య రేవతి శోకదేవతలా వసారాలోని స్తంభానికి ఆనుకుని శూన్యంలోకి నిర్వేదంగా చూస్తోంది.

కదిలిస్తే గండి తెగిన చెరువయ్యేలా ఉందావిడ.

'అన్నయ్య లేకపోతే తనకిక భవిష్యత్ ఏది?' తొలుస్తున్న ఆలోచనల్తో చిన్నగా ఏడుస్తూ... అతని చెల్లి.

తన కళ్లముందు కన్న కొడుకు చనిపోయాడన్న నిజాన్ని జీర్ణించుకోలేక పొగచూరిన కళ్లతో కొడుకు శరీరాన్ని తడిమి చూస్తోంది సూర్యం తల్లి.

"ఫాక్టరీ మూసి సంవత్సరం దాటుతోంది. అప్పటి నుండీ జీతాల్లేవు. ఆర్థిక ఇబ్బందులకి తట్టుకోలేకపోయాడు. మళ్లీ ఉద్యోగం కోసం తిరగని కంపెనీ అంటూ లేదు... విసిగిపోయినట్లున్నాడు పాపం!" ఎవరో మరెవరితోనో

అప్పాజోస్యుల - విష్ణుభొట్ల
ఫౌండేషన్ (యుఎస్ఏ),
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
నిర్వహించిన కథల పోటీలో
'కథాప్రభ'కు ఎంపికైన కథ

చెబుతున్నారు.

"ఎవరో చేసిన అవినీతి నేరాలకి అమాయకులైన కార్మికులు బలి. వాటిని అరికట్టలేని ప్రభుత్వం వనమహోత్సవాలకి కొత్త మొక్క నొకదాన్ని నాటి చెంబుడు నీళ్లు గుమ్మరించి ఇహ దాని ముఖం చూడనట్లు, నిరుద్యోగ సమస్యల్ని పూరిస్తాం. స్వయం సమృద్ధిని సాధిస్తాం అంటూ కొత్త కొత్త పరిశ్రమల్ని స్థాపించడం వరకే! తర్వాత వాటి అతీ గతీ చూడరు..." మరొకరి కామెంట్.

"చిన్న పిల్లలు, పెళ్లి కావల్సిన చెల్లి, రోగిష్టి తల్లి... వీళ్లందరినీ ఎలా నెట్టుకొస్తుందో... రేవతికి వచ్చిన కష్టం పగాళ్లకయినా రాకూడదు." ఆ ఏడుపుల మధ్య ఎవరిదో స్త్రీ కంఠం విన్పిస్తోంది.

జనం ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుకుంటున్నారు. జీవితంపై నాకున్న అభిప్రాయాల్ని పక్కనుంచితే... సూర్యం గొప్ప ధైర్యవంతుడేమో అన్పించింది. చావడానికి ఎంత ధైర్యం కావాలి. అందరిలా ప్రతీక్షణం గుబులుతో భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, బతుకు భయంతో జీవించడం ఎంత నరకం!

'వీరునికి ఒకేసారి మరణం...' ఏదో సూక్తి మనసులో మెదిలింది.

ఇదేమిటీ ఇట్లా ఆలోచిస్తున్నాను. నాలోనూ బేలతనం ప్రవేశించిందా! ప్రస్తుత పరిస్థితిలో నేనూ, సూర్యమే కాదు... వేలమంది కార్మికులం చితికిన మా జీవితాలకు అతుకుల్ని వేయడానికి మధనపడుతున్న వాళ్లమే!

మా బతుకులన్నీ ఒకప్పుడు నిండయిన పచ్చని వృక్షాలే. ఇప్పుడిలా చీడపట్టి, మోడువారి, ఎండిపోవడానికి గల నేపథ్యం ఆలోచిస్తే...

గుండెల్లో శబ్ద రహితంగా ఫిరంగీలు పేల్తాయి.

ముందుగా చెప్పరాని భూకంపంలా మా జీవితాలిలా అతలాకుతలం అవుతాయని కంపెనీలో చేరిననాడు ఊహించలేకపోయాము.

సూర్యం కుటుంబ పరిస్థితి రేపేంటి? ఆలోచన మెదడుని తొలుస్తోంది.

అంతిమయాత్ర ఏర్పాట్లు చూడమంటున్నారెవరో. సూర్యం దగ్గరి బంధువులకి ఫోన్లు చేయడానికి, టెలిగ్రాము ఇవ్వడానికి వెళ్లారు కొందరు.

**కారం కారం**
**కథాప్రభ**

ఈ మధ్యనే మాకు దగ్గర్లో ఉన్న మరో ప్రభుత్వ రంగ సంస్థని మూసి వేశారు. మళ్లీ మా లాకౌట్‌ని తొలగించి, ఉద్యోగా లిస్తారన్న ఆశతో ఎదురు చూసిన మాకు ఈ సంఘటన చెప్పరాని నిరాశని కలిగించింది.

ముఖ్యంగా మళ్లీ యథాలాపంగా కంపెనీ తెరుస్తారని ఆశిస్తూ జీవిస్తున్న సూర్యానికి అదొక షాక్‌లా అనిపించింది.

సూర్యంతో నా స్నేహం దాదాపుగా పదేళ్ల నుండి. పురోగమనం నుండి తిరోగమన క్రమంలో ఎంత నిస్తేజంగా బతుకుతూ వచ్చామో ఆలోచిస్తూ ఆత్మావలోకనం చేసుకోవటం మానేశాను.

ఎందుకంటే... అవన్నీ గుర్తొస్తే గుండెలు రగిలిపోతాయి. తెలియని కసి శరీరమంతా వ్యాప్తి చెందుతుంది.


మా జీవితాల్ని చెట్టుకీ, పుట్టకీ కాకుండా పంచనామా చేసిన అవినీతి జాతిపై ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది.

సూర్యం మరణం మళ్లీ నాలో బడబాగ్నిని రగుల్కొల్పింది. మండుతున్న గుండెపొరల్లో మరుగుతున్న జ్ఞాపకాల లావా చిమ్మడానికి దోహదం చేస్తోంది.

* * *

పది సంవత్సరాల క్రితం చేస్తున్న ప్రైవేట్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి, ప్రభుత్వం రంగ సంస్థలో ఉద్యోగం వచ్చిందన్న సంబరంలో అంబర వీథుల్లో విహరిస్తూ అనామిక వాచ్ కంపెనీలో చేరాను.

జీవితంలో మొట్టమొదటి సారిగా తెలియక చేసిన తప్పు అది. ఆర్డర్స్ తీసుకున్న రోజే సూర్యంతో పరిచయం అయింది. సూర్యం అప్రెంటీస్ ఎక్కడో






పూర్తి చేసి ట్రైనీగా చేరాడు. నా కప్పటికే ప్రైవేట్‌లో నాలుగేళ్ల అనుభవం ఉంది.

లేత్ మిషన్‌పై ఆపరేటర్‌గా చేస్తూ... పదిహేను వందలపై చిలుకు సంపాదించే నేను, ప్రభుత్వ సంస్థ అన్న వెర్రి వ్యామోహంలో ట్రైనింగ్ పీరియడ్‌లో తక్కువ స్టయిఫండ్ ఇస్తారని తెలిసినా, ఇలాంటి అవకాశం మరోసారి జీవితంలో రాదని, భ్రమించి చేరాను.

కొన్నాళ్లు కష్ట పడ్డానంటే... జీవితంలో స్థిరపడచ్చు. ప్రమీలతో నాకప్పటికే పెళ్లయింది. వచ్చే డబ్బులు సరిపోవని తనని ఊర్లోని మా ఇంటికి పంపించాను.

అప్పుడికింకా సూర్యానికి పెళ్లవలేదు గనక ఇద్దరం ఓ గది అద్దెకు తీసుకుని కలిసి ఉన్నాం.

శిక్షణ సమయంలో జీతం తక్కువిస్తారన్న కొంత బాధ తప్పిస్తే రిటైర్ అయ్యేదాకా ఏ ఢోకా లేదు. పూర్తి ఉద్యోగ భద్రత.

అబ్బ! ప్రైవేట్ పీడ వదిలింది. ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో కొన్నాళ్లు ఆకలే మరిచాను. కళ్ల ముందు ఆశల మేఘాలు రకరకాల ఆకృతుల్లో కదలాడేవి. వెధవ ప్రైవేట్! నాలుగేళ్లు చావబాది వదిలారు నిర్దాక్షిణ్యంగా.

అరిటాకు, ముల్లు సంబంధంతో పోల్చడం ఇష్టం లేకపోయినా రమారమీ... ప్రైవేట్ సంస్థలకీ, కార్మికులకీ ఉండే అనుబంధం ఆ రకందే! ఎవరికి కోపం వచ్చినా ఉద్యోగం గోవిందా! ఇక్కడ అలా జరిగే వీలుండదు. యూనియన్లు మనకండగా ఉంటాయి.

కాంటీన్ సౌకర్యం, బోనస్‌లు, ఎల్.టి.సి.లు, మెడికల్ బిల్స్... కళ్ల ముందు మెరిసేవి. ఉద్యోగంలో చేరిన కొత్తలో మదిలో మెదిలే భావ దృశ్యాలవన్నీనూ.

సూర్యం నేను ఒకే సెక్షన్‌లో ఉన్నా, తను నాణ్యతా విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా ఉండేవాడు. మా షాప్‌లో సుమారు ఎనభై మంది దాకా కార్మికులుండేవారు.

మేం చేరేనాటికి అనామిక వాచ్ మంచి లాభాల్తో, ఇండియాలో అగ్రగామిగా ఉండేది. ఎవ్వరి చేతికి చూసినా అనామిక వాచే! అందులో పని చేస్తున్నందుకు గర్వంగా ఫీలయ్యేవాణ్ని.

అంతవరకూ అంతగా పట్టించుకోని నేను జనం మణికట్టుల్ని చూస్తూ, అక్కడున్న అనామిక వాచ్ అని కన్పిస్తే, ఛాతీ అరంగుళం సాగేది.

అనామిక పై నగరంలో పెద్ద పెద్ద కటౌట్లనీ, టి.విలో కన్పించే అడ్వర్‌టైజ్‌మెంట్సనీ చూస్తున్న మాలో కొత్త ఉత్సాహం కల్గేది.

అలా తారాపథంలో చంద్రుడిలా వెలుగుల్ని విరజిమ్మిన అనామిక వాచ్ కంపెనీ దివాలా తీసి, ఖాయిలా పరిశ్రమగా ఘనత కెక్కి, క్షీణించి, అమావాస్య చందమామలా మా బతుకుల్ని చీకటి మయం చేసింది.

దివాలాకి కారణమైన నేపథ్యం ఒకటా... రెండా!

కర్ణుడి చావుకి కారణాలనేకంలా, కడుపు చించుకుంటే కాళ్ల మీద పడేవి ఎన్నెన్నో!

నిజానికి కార్మికులు పని చేయరనీ, ఆడుకో డానికి ప్రభుత్వ సంస్థలకు వస్తారనే వదంతులు ఎవరు సృష్టిస్తారో కానీ... కార్మికులంతా పని చేయకపోతే అభివృద్ధి మాటేమిటి?

మూలాల్ని వెతికితే సమాధానాలు దొరికినా, అతి స్వల్ప శాతం కార్మికులు మాత్రమే పని దొంగలు ఉంటారు. అది కూడా ఉద్యోగ భద్రతతో వచ్చిన ధీమా. కాకపోతే ఇలాంటి వారి నుంచి మరొకరు చెడిపోయే అవకాశం ఉంది.

ప్రభుత్వం నిధులివ్వడంతో సరిపోదు. స్వయం సమృద్ధికై నియామకం చేసిన యాజమాన్యం పని తీరుని గమనించకపోతే సముద్రాల్నే తాగేసే ఘనులున్న ఈ దోపిడి వ్యవస్థలో ఇలాంటి పరిశ్రమలొక లెక్కా.

ఎవ్వరికందింది వాడు స్వాహా చేసి, కార్మికుల నోట్లో మట్టి కొట్టి, వీధిన పడేసే వరసక్రమాన్ని నేను అనామికలో చేరిన నెలరోజుల్లోనే గమనించాను. ఏడాది శిక్షణ పేరుతో తీసుకున్న మమ్మల్ని డైరెక్టుగా యంత్రాలపై పని చేయమన్నారు. నాకంటే గతానుభవం ఉంది గనక, మిషన్ అంటే ఏమిటో, టూల్ అంటే ఎలా ఉంటుందో కొంత తెలిసిన వాణ్ని గనక ప్రొడక్షన్ చేయగలను. మరి మిగతావారో!

పక్క సెక్షనయిన యూనిట్ అసెంబ్లీలో వాచ్‌గ్లాస్‌లు వీళ్ల చేతుల్లో ఫట్‌ఫట్‌మని పగిలి, ఎన్నో పనికి రాకుండా పోయాయి.

ఇంత నిర్లక్ష్యంగా కనీసం రెండు నెలలయినా శిక్షణ ఇవ్వకుండా, ఓ క్రమం లేకుండా జరుగు తోందేమిటిక్కడంతా.... ప్రైవేట్ సంస్థల పురోభి వృద్ధికీ, ప్రభుత్వం సంస్థల తిరోగమనానికీ గల వ్యత్యాసం బోధపడటం మొదలయ్యిందిప్పుడే.

మాకున్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఉన్న మిషనరీతో మంచి పనిమంతులయిన కార్మికు లతో ఎంత ప్రొడక్షనయినా చేయవచ్చనిపించింది.

ప్రతి షాప్‌కు అవసరమయ్యే కొన్ని పరికరాల్ని మాకున్న టూల్ రూమ్‌లో నాణ్యతగా చేయొచ్చు. అలాగే వాచ్‌కు సంబంధించిన కొన్ని పార్ట్స్‌ని ఎన్నయినా తయారు చేసుకోవచ్చు. కానీ అలా చేయకుండా సబ్ కాంట్రాక్టర్లకి ఇవ్వడం చూస్తుంటే ఆశ్చర్యం వేసేది. ఒక రోజు మా మేనేజర్ని అడిగాను.

"ఎందుకు సార్! ఈ పాటి టూల్స్‌నీ, ఈ బాక్ కవర్సునీ మనం చేసుకోవచ్చు కదా. అనవసరంగా అదనపు ఖర్చుతో బయట పార్టీలకు ఇవ్వడం దేనికి?"

నా కేసి అతనుచూసిన చూపులో ఎంత నిర్లక్ష్యం! ఒక కార్మికుడివై ఉండి నీ పని నీవు చేసుకోనుండక, ఇతర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని నాకు వార్నింగ్ ఇస్తూ బయట చేయిస్తే కాస్ట్ తక్కువవు తుందని సర్ది చెప్పాడు.

ఆయన చెప్పిందాట్లో కించిత్తయినా సత్యం లేదనిపించింది. తర్వాత తెలిసిందేమంటే కంపెనీలోని కొందరు మేనేజర్స్ బయట అన్సల రీలు స్థాపించి పని కల్పించుకుని డబ్బు సంపాదించే ఉద్దేశంతో కంపెనీలో మా కార్మికుల్తో చేయిస్తే మంచి నాణ్యత రాదని నమ్మిస్తూ, పర్చేజ్ డిపార్ట్‌మెంట్ వాళ్లతో లాలూచీలు పడి ఆర్డర్స్ కొట్టేస్తున్నారని తెలిసింది.

ఎంత అన్యాయం! బడిలో పాఠాల్ని సరిగ్గా చెప్పక, అందర్నీ తన ఇంటికి ప్రైవేట్ చెప్పించుకో

డానికి రమ్మనమని చెప్పే అధ్యాపకుల్లా కన్పించారు.

ముడి సరుకు వచ్చిన దగ్గర్నుంచీ, వాచీ తయారయి మార్కెట్‌లోకి వెళ్లే దాకా ఎంతోమంది కార్మికులు ఎన్నో రకాలుగా కష్ట పడతారు.

వాచ్‌లోని కొన్ని పార్ట్సును మాత్రమే విదేశాల్నుండి దిగుమతి చేసుకోటం జరుగుతుంది. కొందరు కార్మికులు కంపెనీకి అల్లుళ్లుగా చలామణీ అవుతుండటం నేను చేరిన దగ్గర్నుండీ గమనిస్తూనే ఉన్నాను. వాళ్లు పనిచేయడం నా కళ్లతో చూసిన పాపాన పోలేదు. చిత్రం కాకపోతే అలాంటి వారి చేత కచ్చితంగా పని చేయించాల్సిన బాధ్యత ఉన్న మేనేజర్స్ వార్ని చూస్తే భయపడేవారు.

వారి వెనకున్న హస్తాలు మామూలువి కావని, తలచుకుంటే మేనేజర్స్‌ని ఎలా ఆడించగలవో తెలుసుకున్న వార్లై, వీరిని అంతా పట్టించుకోరని తెలిసింది.

యూనియన్‌కి సంబంధించిన వారి కో న్యాయం!

రాజకీయ హస్తమున్న వారి కో న్యాయం!

ఎవరి అండా లేని సామాన్య కార్మికుడి కో న్యాయం!

మరి ఇదేం న్యాయమో!

తీరా వీళ్లలో కొందరు పన్చేయకపోగా, చేసేవారిని చెడగొడుతున్నారనేది వాస్తవం. తీరిక చేసుకుని రకరకాల వ్యాపారాల్ని చేసుకునేవాళ్లు. బట్టలు మొదలుకొని నిత్యావసర వస్తువుల్ని కొన్నింటిని ఇన్‌స్టాల్‌మెంట్స్‌పై కార్మికులకు అమ్మేవారు.

డ్యూటీకి రాగానే పంచ్‌కార్డ్ కొట్టేసి, తమ స్వంత పనేదేమైనా ఉంటే చూసేసుకుని బయట పడేవాళ్లు.

కంపెనీలో పైనా పని చేయకపోయినా అవుట్ డోర్‌లో ఉన్నట్లు రాయించుకుని పూర్తి జీతం తీసుకునే ఈ రకం కార్మికులకు పని చేసే తోటి కార్మికులు లోకువగా కన్పించేవారు.

పని చేసేవాడికీ, చేయనివాడికీ ఒకే జీతం. అందరి గుండెలు మండిపోయేవి. పలుకుబడి ఉన్న వాళ్లు ఏ షిఫ్ట్‌లోనైనా రావచ్చు. ఎప్పుడయినా వచ్చి, ఒ.డి. రాయించుకోవచ్చు. ఏ అండాలేని కార్మికుడు ఏ పొరపాటు చేసినా షోకాజ్ నోటీసులు టైపు జరిగిపోయేవి.

కులగజ్జి బాగా రాజ్యమేలేది. షాప్ ఇన్‌చార్జ్ ఒక కులానికో, మతానికో లేదా పరాయి రాష్ట్రానికో చెందిన వాడయితే ఆ తెగకు సంబంధించిన కార్మికుల్ని తన వైపు తిప్పుకుని గ్రూపిజం నెరపడం మామూలే.

కార్మికులు కూడా తెలివితనంతో గ్రూపులుగా చీలిపోయి దొరికిపోయేవారు. అప్పుడప్పుడూ చిన్న చిన్న విలువయిన వాచ్ పార్ట్స్ మాయం అవుతుండేవి. మేమంతా ఆశ్చర్యపోయేలా మర్నాడు దినపత్రికల్లో అనామిక వాచ్‌లో చోరీ నష్టాన్ని బేరీజు చేస్తూ వివరాల్ని ప్రకటించేవారు.

అందరూ కోమట్లే. కోళ్లు మాయమైన తీరులో సెక్యూరిటీ ఎంత బందోబస్తుగా ఉన్నా దొంగతనాలు అప్పుడప్పుడూ జరగటం, పోలీసులు రంగ ప్రవేశం చేయటం మామూలయిపోయింది.

ఎందుకోగానీ అన్ని రోజులూ పట్టించుకోని మేనేజ్‌మెంట్ హఠాత్తుగా ఆఫీసర్ ర్యాంకు వార్ని కూడా మెటల్ డిటెక్టర్తో చెక్ చేయటం మొదలెట్టింది.

దొంగలని కొందర్ని పట్టుకున్నా ఏదో వారి మీద కఠిన చర్యలు తీసుకున్నట్లే కనబడేది. మరి కొంత కాలానికి మరుగున పడిపోయేది సమస్య.

ఇంటి దొంగల్ని ఈశ్వరుడైనా పట్టలేడన్న చందంలా లోగుట్టు ఎవరికీ తెలిసేది కాదు.

ఇక షాపుల్లో అనవసరంగా చాలా మెటీరియల్స్ వేస్టేజి అవుతుండేది. ఖరీదయిన ఆయిల్స్‌ని అవసరానికి మించి, వినియోగిస్తూ ఎక్కడబడితే అక్కడ వదిలేయటంతో ముఖ్యంగా వాటిల్లో మండేగుణం ఉంటం మూలాన ప్రమాదాలు పొంచి ఉండేవి.

షాప్ ఫ్లోర్లో కొందరు కార్మికులు ఆయిల్స్ ఉన్నవైపు సిగిరెట్లు కాల్చటం నాకు చాలా కోపం తెప్పించేది. షాప్స్‌లో పొగతాగటాన్ని ఎలా చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారో అర్థం కాకపోయేది.

ఒక రోజు నేను నైట్ షిఫ్ట్‌లో ఉండగా జరిగిన సంఘటని తల్చుకుంటే ఒళ్లంతా గగుర్పొడిచింది.

అంతకు ముందే నాలుగు నెలల కిందట అప్రెంటీస్‌గా చేరిన రాజు అనే అతను పక్క సెక్షన్ నుండి మా షాప్‌లోకి వచ్చి రెండ్రోజులే అయింది. ఆ అబ్బాయికి పెగా సాయిల్ అనే ఆయిల్‌లో మండే గుణం ఉంటుందన్న సంగతి ఎవరూ చెప్పలేదు. కంపెనీ శిక్షణలో కూడా లేదు... అసలు శిక్షణంటూ ఉంటే గదా!


రాత్రి ఒంటిగంట సమయంలో కాబోలు బాత్రూము వైపు నుండి పెద్ద పెద్ద అరుపులు వినిపించాయి. మిషన్స్‌పై పనిచేస్తున్న మాకు మొదట్లో అర్థం కాలేదు. ఆ వెంటనే పెద్ద వెలుగు కనిపించింది. అలా అటుకేసి చూస్తున్న అందరం అదిరిపడ్డాం ఆ దృశ్యాన్ని చూసి.


రాజు పూర్తిగా తగలబడిపోతూ ఫ్లోర్‌సైడ్‌కి పరిగెత్తుకొస్తున్నాడు. ఏం జరిగిందో ఊహించేలోగా పెడబొబ్బలు పెడుతూ దభీమని పడిపోయాడు. కొందరు భయపడ్డా, మరి కొందరు కర్తవ్యం గుర్తొచ్చి మంటలార్పే ప్రయత్నం చేశారు. అంబులెన్స్‌ని రప్పించి రాజుని హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. మరో రెండ్రోజులుండి చనిపోయాడతను. తన షర్ట్‌కి అంటుకున్న ఆయిల్ మరకల్ని పోగొట్టే గుణం ఉందని తెలుసుకున్న రాజు పెగసాయిల్‌లో షర్ట్ ముంచి, వెంటనే తొడుక్కుని తర్వాత బాత్రూమ్‌లో సిగరెట్ కోసం అగ్గిపుల్లని గీరటంతో ఏర్పడ్డ ప్రమాదమని తరువాత తెలిసింది.

రాజు ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య ఉన్నప్పుడు నేను వెళ్లాను.

లేకలేక పుట్టిన ఒకే కొడుకంటూ... గోడు గోడున విలపించే అతని తల్లిదండ్రుల్ని చూస్తే గుండె తరుక్కుపోయింది.

ఆ తర్వాత యాజమాన్యం వారికి ఏం సంజాయిషీ చెప్పిందో తెలీదు. అవసరాల్ని బట్టీ, అవకాశాన్ని కల్పించుకునో తెలీదు గానీ, అప్పుడప్పుడు కొంత మంది ఆఫీసర్లని యాజమాన్యం






వాచ్‌కు సంబంధించిన కొత్త శిక్షణకంటూ జపాన్, జర్మనీ పంపించడం జరిగేది.

శిక్షణ నిమిత్తం కొన్ని లక్షల్ని ఖర్చు చేసేది. సరిగ్గా ఆ సయమంలోనే రాజకీయ శక్తులు బాగా పనిచేసేవి. తెరచాటున జరిగే వ్యవహారాల పరాకాష్ట తర్వాత కొందరు విదేశాల కెళ్లేవారు.

నిజానికి అందులో ఏ ఒక్కరిద్దరో ఆ శిక్షణకి అర్హులయి ఉంటారు. కష్టపడి పనిచేసే ఆఫీసర్లకు అవకాశం రానందుకు... కార్మికుల ముందు చెప్పుకుని నిరాశ పడిన సందర్భాలూ ఉన్నాయి.

ఇది ఇలా జరిగాక తీరా శిక్షణ పూర్తయ్యాక వచ్చినవార్ని వారు నేర్చుకుని వచ్చినదానికి సంబంధం లేని డిపార్ట్‌మెంట్‌కి బదిలీ చేసేవారు.

ఇది నాకు అర్థం గాని చిక్కు ప్రశ్నగా మిగిలేదెప్పుడూ. అలాంటప్పుడు కొన్ని లక్షలు ఖర్చు పెట్టి, వాళ్లని విదేశాలకి శిక్షణకై పంపడం దేనికి? అడిగే దిక్కు ఉండేది కాదు.

కంపెనీ అప్పటికే బీటలు వారడం మొదలయ్యిందేమో! మార్కెట్ విధానంలో చాలా అవక తవకలున్నాయని అనుకునేవారు.

ప్రభుత్వం ఒక పక్క స్వయం సమృద్ధి పథకాల కింద పబ్లిక్ సెక్టార్స్‌ని స్థాపిస్తూ, మరో పక్క అదే ప్రాడక్ట్‌ని ప్రైవేట్ వారిని చేసుకోమని లైసెన్స్ ఇవ్వడంలో గల నేతి బీరకాయ నీతేమిటో నా కర్థం గాకపోయేది.

సహజంగానే ప్రైవేట్ యాజమాన్యం నక్కజిత్తుల్తో పబ్లిక్ సెక్టార్స్ నుండొచ్చే ప్రాడక్ట్ నిలిపివేయడానికో, మార్కెటింగ్‌లో చాటు మాటు వ్యవహారాల్తో కథల్ని నడిపి, మార్కెట్లో తమ ప్రాడక్ట్స్‌ని మాత్రమే అమ్మకానికి ఉంచుకునేలా చూస్తుంది.

ప్రభుత్వం వైఖరి ఇల్లా ఉందేమిటి... అనిపించేది. తీపిగా నోటితో మాట్లాడ్తూ, చేదుగా నొసటితో వెక్కిరించే తత్త్వం అంటే ఇదే కాబోలు!

మార్కెట్లో ఏదైనా వాచ్ షాప్ కెళ్తే, సేల్స్‌మెన్ చెప్పే మాటలు విన్న వారికి పిచ్చెక్కిపోయేది. మా మిత్రులు కొందరు నాతో అనటం విన్నాను కొన్ని సార్లు. మార్కెట్‌లోకి అనామిక వాచ్ కొందామని వెళితే, అనామిక ఎందుకు సార్. ఏదైనా రిపేర్ వస్తే మళ్లీ ఎప్పుడు అందిస్తామో తెలీదు. ఇలా చూడండి. కొత్త కొత్త వాచీలు, రకరకాల కంపెనీలవి వస్తున్నాయి. అంటూ బోధిస్తున్నారట.

ఎంత అవమానం!

అనామిక వాచ్ ఇంత దిగజారిపోయిందా! నాణ్యత కలిగిన స్పేర్‌పార్ట్స్‌తో అద్భుతమైన వాచ్ అయిన అనామిక గురించి సేల్స్‌మెన్లు ఇలా దుష్ప్రచారం చేయటానికి గల తెరవెనక నేపథ్యం ఏమిటో... అదెంత భారీ ఎత్తులో జరుగుతోందో?

షాప్ ఫ్లోర్లో ఏ మారుమూలో పని చేసుకునే కార్మికుడి దాకా చాలా విషయాలు వెళ్లేవి కాదు. ఒక్కోటీ తర్వాత్తర్వాత బయటకొచ్చేది.

స్వఫలం ఆశించకుండా కేవలం కార్మికుల శ్రేయస్సును కోరి... ఎలక్షన్స్‌లో నిల్చునే యూనియన్లు ఎక్కడైనా ఒకటీ, అరా తప్పితే అన్నీ యాజమాన్యంతో కుమ్మక్కై, కడుపులు నింపుకునేవే ఉంటాయనేకునేవారు.

ఒక పెద్ద కంపెనీ ఉందంటే నాలుగైదు యూనియన్లు జొరబడి, కార్మికుల్ని పంచనామా చేసినట్లు ఐక్యతని ముక్కలుగా చేస్తాయి.

రాను రాను ప్రాడక్షన్ తగ్గుతూ వచ్చింది. ప్రాడక్షన్ కన్నా స్క్రాప్ రూపంలో పనికిరాని మెటీరియల్ అమ్మి కొందరు లాభం పొందారని తెలిసింది. ముడి సరుకు రావటంలో జాప్యం జరుగుతోంది.

ఎనిమిది గంటలు పని చేసే కార్మికుడికి నాలుగు గంటలు మాత్రమే పని చేయడానికి మెటీరియల్ లభించేది. మిగతా నాలుగు గంటల్ని ఎలా గడపాలో తెలిసేది కాదు మాకు. ఆలోచిస్తే... అంతా ఓ వరస క్రమంలో జరుగుతున్నట్లు అన్పించసాగింది నాకు.

పేపర్లో ఒకసారి ఉదయం వచ్చిన వార్త సంచలనంగా మారింది. "అనామిక వాచ్‌లో అవినీతి జాడ్యం. నష్టాలదారిలో కార్మికుల పరిస్థితి అయోమయం" అర్థం వచ్చేలా హెడ్డింగులతో.

అంతలో కేంద్ర ప్రభుత్వం నూతన ఆర్థిక పారిశ్రామిక విధానం కింద ఖాయిలా పడ్డ పరిశ్రమల్ని ప్రైవేట్ పరం చేసి, చేతులు దులుపుకోవాలన్నది కూడా మా అందరిలో చర్చనీయాంశం అయింది.

అంతవరకూ స్తబ్ధతగా ఉన్న కార్మికుల్లో ఎక్కడో సెగ తగిల్నట్టు, గాఢ సుషుప్తిలోంచి మేల్కొన్నట్లు చైతన్య వంతులు కాసాగారు.

ఒక క్రమంలో ఇచ్చే జీతాలు రకరకాలుగా తేదీల్ని మారుస్తూ ఇవ్వసాగారు. జీతాలు ఆలస్యం అవటంతో సమయానికి ఇంటి అద్దెల్ని, పిల్లల స్కూల్లో ఫీజుల్ని కట్టలేక రకరకాల ఇబ్బందుల్లో కార్మికులు కూరుకుపోవాల్సి వచ్చింది.

నేనూ, సూర్యం కంపెనీలో పర్మనెంట్ అయి ఆర్నెల్లయినా అవకుండా ఇదేమిటీ కంపెనీ ఇట్లా అయిపోయింది. అగమ్యగోచరంగా ఉంటోంది.

ఊర్నుంచి ప్రమీలను తీసుకువచ్చి వేరుగా కాపురం పెట్టాను. సూర్యానికి కూడా మరో నెల తర్వాత పెళ్లవటం జరిగింది. సూర్యంతో పాటు అతని చెల్లి, తల్లి కూడా ఉంటున్నారు. రోజురోజుకీ ధరలు ఆకాశాన్ని అంటుకుపోతోంటే... ఎక్కడేసిన గొంగళి... కథలా మా జీతాలు పెరగటం ఆగిపోయాయి.

ప్రభుత్వం ఖాయిలా పరిశ్రమ కింద అనామికను చేర్చటంతో ఎల్.టి.సి.లు, మెడికల్ సౌకర్యాలు, బోనస్‌లు, ఇన్‌సెంటివ్‌లు... చివరకు మేం దాచుకున్న పి.ఎఫ్‌ల్ని కూడా ఇవ్వడం ఆపేశారు.

తోక మూరడే ఉన్నట్లు జీవితాలు ఒకే దగ్గర కేంద్రమై ఉన్నాయి. చేతినిండా సరిగా పనిలేక సంవత్సరం అవుతోంది. జీతాల్ని మాత్రం ఇస్తున్నా... పని చేయకుండా డబ్బుల్ని తీసుకోవ టంలో గిల్టీగా ఫీలయ్యేవాణ్ని అప్పుడప్పుడూ.

అనామిక వాచ్‌ని ప్రైవేట్ రంగానికి అప్పచెప్పాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వార్తలొచ్చాయి.

భారీ నష్టాలో కూరుకుపోయిన అనామికను చంద్రమతిని హరిశ్చంద్రుడు అమ్మినట్లు మమ్మల్నందరినీ ప్రైవేట్ వారికి అప్ప చెబుతారన్న మాట!

కార్మికులం అందరం బెదిరిపోయాం.

పని చేయకుండా బలాదూరుగా తిరిగే

కార్మికులకు ప్రైవేటైజేషన్ సరయిన శిక్ష అన్నారు కొందరు. సరే! మరి మేమంతా గతంలో అక్కడ చేసిన వాళ్లమే. వాళ్లు ఎలా కార్మికుల్ని పీడించి, వేపుకుతింటారో ఎవ్వరికీ సరిగ్గా అవగాహన లేనట్లుంది.

అధికారంలో ఉన్న యూనియన్ ప్రెసిడెంట్‌ని లాక్కొచ్చారు ఆఫీస్ బేరర్లు. బహిరంగ సభల్లో అతను ఇచ్చిన ఎన్నో హామీలు.... కంటి తుడుపు చర్యలే అయ్యాయి. "ఇది కేవలం ఏదో ఆధారంతో పత్రికల వారు రేపుతున్న దుమారం మాత్రమే! మీ ఉద్యోగాలకి ఎలాంటి భద్రతా లోపించదు. ప్రభుత్వం పెట్టిన నూతన పారిశ్రామిక ఆర్థిక విధానం మూలంగా ఇవన్నీ పుట్టుకొస్తున్నాయి. మీరవన్నీ పట్టించుకుంటే నేను రోజుకోమారు బహిరంగ సభని పెట్టాల్సి ఉంది."

మా ప్రెసిడెంట్ మాటలకి అప్పటికి కొంత సేదతీరినట్లు అనిపించింది. రోజూ కంపెనీకి వెళ్తున్నా ఏదో అసంతృప్తి. మిషన్స్ చాలా వరకు ఖాళీగా, దీనంగా మాకేసి చూస్తున్నట్లున్నాయి.

ప్రతీ కార్మికుడి తలలోనా ప్రశ్నే! ఎందుకిలా అందర్నీ ఖాళీగా కూర్చోబెట్టి జీతాలిస్తున్నారు? కొంపదీసి తుఫాన్ ముందువచ్చే ప్రశాంతత కాదు గదా!

ఎవరికీ పని లేకపోవటంతో అసలు సమస్యలు తలెత్తాయి. షాప్ ఫ్లోర్లో కార్మికులు జట్లు జట్లుగా గుమిగూడి దేశ రాజకీయాల గురించి, రకరకాల అంశాల గురించి చర్చిస్తూ కాలం గడిపేవారు.

కొందరు దాదాపుగా పేకాట ఆడటం మొదలెట్టారు.

పని ఇవ్వకుండా కార్మికుల్లో బద్ధకాన్ని, నిరుత్సాహాల్ని పెంచి పోషిస్తున్న యాజమాన్యం కార్మికులు పేకాడటం సహించలేకపోయినట్లు క్రమశిక్షణా రాహిత్యం కింద, ఆడేవారిని ఓ రోజు పట్టుకుని సస్పెండ్ చేసింది.

నిజానికి ఇలా పేకాడటం జరుగుతోంది కంపెనీలో అని బయట ఎవరికైనా తెలిస్తే ఎంత అవమానం అనిపించింది.

అంత భయం లేకుండా ఆడుతున్న వాళ్లంతా వెనక బలం ఉన్న వారని, వారు సస్పెండ్ అయిన పదిరోజుల్లోనే దర్జాగా తలలెత్తుకుని డ్యూటీలో చేరటంతో తెలిసింది.

అదీ కథ! ఇలాంటప్పుడు రాజకీయ శక్తులు పని చేస్తాయి. ఇంకేముందీ... మరో వారం తర్వాత మళ్లీ చాటు మాటుగా పేకాట మొదలయ్యింది. మనిషిలో రెసిస్టెన్స్ పవర్ తగ్గినప్పుడు లోపల ఉన్న చిన్న చిన్న రోగాలు బహిర్గతమైనట్లులోన ఉన్న దాగి ఉన్న వ్యసనాల్ని పనిలేని తనం అనేది పెంచి పోషిస్తున్నట్లుగా ఉంది.

ఎప్పుడైనా... ఆఫీసర్లు క్రమశిక్షణ గురించి కార్మికులకు చెప్పబోతే... "మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు సార్. ముందు మీ యాజమాన్యం సరిగ్గా ఉందా? అసలీ వ్యవస్థే అస్తవ్యస్తంగా ఉంది. స్వయం సమృద్ధమంటూ, నిరుద్యోగ సమస్యను పూరిస్తాం అంటూ ప్రభుత్వం ఇలా కంపెనీలు స్థాపించడం, నియమించిన యాజమాన్యం అవినీతిని పట్టించుకోకుండా... కొంత కాలం నిధులిచ్చి ఆపేయటం... తర్వాత మా బతుకులు కుడితిలో పడ్డ ఎలకల్లా కొట్టుకు చావడం... వెళ్లండి, వెళ్లి చూడండి... పర్చేజింగ్. మార్కెట్లో... ఎన్ని అవకతవకలున్నాయో, ఎందరు బకాసురులు ఉన్నారో... మా రక్తం చెమటోడ్చితేనే కద సార్ మీరంతా దర్జాగా బతికేది..." ఇలా ఎదురుగా క్లాసు తీసుకునేవారు.

'మరోసారి మాకు చెప్పి, అనవసరంగా మీ పరువు తీసుకోవద్దు' అనేవారు. ఇంక సంవత్సర కాలం ఇలాగే పరిస్థితి కొనసాగుతూ వచ్చింది.

'భారీ నష్టాల్లో అనామిక వాచ్ త్వరలో మూసివేత?' అన్న హెడ్‌లైన్స్‌లో ఓనాటి దినపత్రికలో వచ్చిన వార్త చదివిన మేమంతా మలేరియా వచ్చినట్లు వణికిపోయాం.

మళ్లీ బహిరంగ సభ. అదే కంటి తుడుపు హామీలు. ఎంతో కొంత అండ ఉండి, బయట ఏ వ్యాపారం అయినా చేసుకుని బతగ్గలం అనుకునే కార్మికులు తప్ప, మిగతా మాకందరికీ గుండెల్లో గుబులు పేరుకు పోయింది.

ప్రతి కార్మికుడి మనసులో పెల్లుబుకుతున్న బాధ ఏమిటో అందరికీ తెలుసు.

సూర్యం పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. తన చెల్లి పెళ్లికి అప్పుగా ఇస్తానన్న మార్వాడీ, పేపర్లో అనామిక వాచ్ మూసివేత ప్రకటన చదివి, మనసు మార్చుకుని సూర్యానికి అప్పు ఇవ్వడం మానేయటంతో, పెళ్లి కొడుకు వాళ్లకి కట్నం కింద అడ్వాన్స్‌గా ఇస్తానన్న డబ్బులు ఇవ్వలేకపోవటంతో... ముఖం మీద కొట్టినట్లు "అంత చేతగాని వాడివి మాలాంటి వారి సంబంధంకై పాకులాడ్డం నేరం" అన్నట్లుగా ప్రవర్తించి మరో సంబంధం వెతుక్కుని వెళ్లిపోయారు.

ఈ షాక్ నుండి సూర్యం చాలా రోజుల వరకూ తేరుకోలేకపోయాడు. తనకీ ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. చాలని, పెరగని జీతం. పెరిగే ధరలు, ఎక్కువయిన బాధ్యతలు... తల్లి రోగాలకి మందులు... వెరసి పై నుండి అప్పులు.


మా శ్రీమతి ప్రమీలకి దగ్గర్లో ఉన్న స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం దొరకటంతో, ఆర్థికంగా నాకు కొద్దిగా తెరిపి. మాకు పిల్లలు కూడా లేకపోవటంతో కొంత బాధ తగ్గిందనిపించింది.


ప్రభుత్వం కంపెనీ భారీ నష్టాల్లో కూరుకు పోయిందనటమే గానీ అలా ఎందుకు జరిగిందో, ఎవరి మూలాన ఇట్లా అయిందో, ఆరా తీయటం, అవినీతిని అరికట్టడం చేయకుండా, ఎంత సేపూ మూసివేత గురించే ఆలోచిస్తోందనిపించింది.

దినపత్రికల్లో రకరకాల వార్తలు వచ్చేవి. "కేంద్ర ప్రభుత్వ నూతన ఆర్థిక, ఆర్థిక పారిశ్రామిక విధానాల మేరకు ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని ప్రైవేట్ పరం చేసి, చేతులు దులుపుకోవాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం వాచ్ డివిజన్‌ను నష్టాల దిశలో నడిపించడానికి కావల్సిన పరిస్థితుల్ని అనుసరిస్తున్నదన్న" విమర్శల్ని ప్రచురించాలి.

పరిస్థితి ముదురుతోంది. అందరిలో రేపేమవుతుందోనన్న ఆందోళన... కొన్ని కార్మిక సంఘాలు కరపత్రాల్ని ముద్రించి పంచి పెట్టసాగాయి.

నష్టాలకు అధికారంలో ఉన్న యూనియన్ అసమర్థతలే కారణం. యాజమాన్యంతో చేతులు






కలిపి, కుమ్మక్కై కార్మికులను వీధుల్లోకి ఈడ్చింది అంటూ దుమ్మెత్తిపోశాయి.

మరి కొన్ని... ఒకర్ని ఒకరు విమర్శించుకోడానికిది సమయం కాదు. అన్ని యూనియన్లూ కలిసి, ఐకమత్యంతో పోరాడాలి. లేకపోతే మన సమస్యలు పరిష్కారం కావని ముద్రించి కరపత్రాల్ని పంచాయి.

తర్వాత అన్ని యూనియన్లు కలిసి ఒక్కటై, కార్మికులం అందరం లారీల్లో సెక్రటేరియట్ దగ్గర ధర్నా జరిపాము.

పరిస్థితి గందరగోళంగా తయారయ్యింది. చాలావరకు ఆఫీసర్ల రాంకుల్లో ఉన్న స్టాఫ్ అంతా వేరే ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్లారు. ప్రతి కార్మికుడికీ భవిష్యత్ భూతంలా కనిపిస్తోంది.

మరో రోజు పేపర్లో మూసివేతగా ప్రకటించిన ప్రభుత్వం గతంలో అనామికని ప్రైవేట్ పరం చేసే ఆలోచనలో టెండర్స్ పెట్టగా, ఏ పార్టీ రాకపోవటంతో మూసివేత తప్పదన్నది మరో సారి హెచ్చరించింది.

ఇలా వారానికీ, పది రోజులకీ గుండెల్ని పిండేసే వార్తలు వస్తుండేవి. అనామిక కార్మికులంటేనే... అందరూ జాలిగా, బేలగా మాకేసి చూస్తున్నట్లనిపించేది.

దినదిన గండం నూరేళ్లాయుష్షులా బతుకు లీడుస్తున్న మాకు ఆయుష్షు తీరిన రోజు రానే వచ్చింది. ఇంకా ఆ సంఘటన కళ్లకు కట్టినట్లే ఉంది.

మామూలుగా అందరం ఆ ఉదయం ఫస్ట్ షిఫ్టకని కంపెనీకి వెళ్లాం. షాక్ తిన్నట్లుగా అల్లంత దూరంలోనే ఉండిపోయాము. కంపెనీ గేటు మూసి ఉంది. దానికో పెద్ద తాళంతో పాటూ సీలు. మోహరించి ఉన్న పోలీసు బలగం.

గేటు పక్కనే ఉన్న గోడకు అతికించబడి ఉన్న కోర్టు ఉత్తరువు. ప్రభుత్వం చేతులెత్తేయటంతో, బాంకికి అప్పు కట్టని సమక్షంలో కంపెనీని స్వాధీనం చేసుకోవచ్చన్న కోర్టు తీర్పు ప్రకారంగా జరిగిందట.

మాకందరికీ పరిస్థితి అర్థం అయ్యేటప్పటికి నిలువునా నీరుగారిపోయాం. కత్తి వేటుకు నెత్తురు చుక్కలేని పాలిపోయిన మొఖాలయ్యాయి అందరివీ.

బిక్కచచ్చినట్లు కళ్లప్పగించి అలా చూస్తున్న మాకు కంపెనీ కేసి చూస్తుంటే దుఃఖం పొంగుకొస్తోంది.

రోజూ మాకు అన్నం పెట్టే కామధేనువుని చెరబట్టి, సంకెళ్లు వేసినట్లు కనిపిస్తోంది కంపెనీ.

వయసు తరుగుతూ, రిటైర్డ్ కాబోతున్న మా కార్మికులు కొందరు గొల్లున ఏడ్వసాగారు. "ఈ వయసులో నా కెవరు మళ్లీ ఉద్యోగం ఇస్తారు? పెళ్లి కావలసిన ఇద్దరు కూతుళ్లున్నారు. అయ్యో...

## ప్రకృతి శిల్పం

గౌను వేసుకున్న అమ్మాయిని పోలి ఉన్న రాతి శిల్పం ఫ్రాన్స్‌లో ఎంట్రెపోర్టెస్ అన్నచోటుకు దగ్గరగా ఉంది. అయితే ఇది మానవులచే చెక్కబడిన శిల్పం మాత్రం కాదు. ఇది కేవలం ప్రకృతిచే మలచబడిన శిల మాత్రమే. ఈ రోజుకీ ఈ ప్రాంతాలకు వెళ్లినవారు ప్రకృతిచే రమణీయంగా మలచబడిన ఈ వింత శిలాప్రతిమను దర్శించకుండా రారు మరి.

శ్రీకొండి (ఎర్రబోడు)

భగవంతుడా! ఎందుకీ అన్యాయం. మా పొట్ట మీద దెబ్బకొట్టారా... మేం నమ్ముకున్న కంపెనీ ఇది. మేం చేసిన తప్పేముంది..." మా పక్క సెక్షన్ కార్మికుడు యాభై ఏళ్ల నాగన్న తలబాదుకుంటూ పెద్దగా ఏడ్వసాగాడు.

ఒక్కో కార్మికుడూ దిక్కు తోచక కంపెనీ ఎదురుగా కూర్చుండిపోయారు. జనరల్ షిఫ్ట్ సమయం అయ్యేసరికి మహిళా కార్మికులంతా వచ్చారు. విషయం తెలుస్తూనే... వారందర్నీ ఆపతరం కాలేదు. గుండె చెరువయ్యేలా ఏడ్వసాగారు.

కార్మికుల ఆర్తనాదాలు అరమైలు దాకా వినిపిస్తున్నాయేమో ననిపించింది. కేవలం ఈ ఉద్యోగంపై ఆధారపడి బతికున్న మహిళల్లో చాలా మంది మధ్య వయస్కులు, భర్త చనిపోగా కుటుంబ భారాన్ని మోస్తున్న వాళ్లు.

కార్మికుల ఆక్రందనల్ని అదుపు చేయలేక పోయారెవరూ. మా అందర్నీ వీధిన పడేసిన యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని శపిస్తూ, మట్టిని దోసిళ్లతో తీసుకుని, గాల్లోకి దుమ్మెత్తి పోస్తున్నారు కొందరాడవాళ్లు.

పెద్దరైలు ప్రమాదంలో ఒకేసారి చనిపోయిన వేలమంది దగ్గరకి వచ్చిన ఆత్మీయులు చేసే ఆక్రందనల్లా ఆ ప్రాంతమంతా దద్దరిల్లసాగింది.

మరి కొద్ది సేపట్లో పోలీసులు మరో రెండు జీపుల్లో రావటం, మమ్మల్ని చెల్లా చెదురు చేస్తూ, లాఠీలకు పని చెప్పటం జరిగింది.

ఆ తర్వాత ఒక్కో కార్మిక నాయకుడు రావటం, మమ్మల్ని పరామర్శించటం జరిగింది. అందరిలో ఏమీ చేయలేని నిస్సహాయత కన్పించింది.

"ప్రభుత్వం మాకు అపోజిషన్ అయిపోయింది. లేదంటే ఒక్కో కార్మికుడికీ రెండు లక్షల దాకా గోల్డెన్ షేక్‌హాండ్ ఇప్పించే వాళ్లం" మా యూనియన్ ప్రెసిడెంట్ అంటుంటే... కార్మికులు నవ్వాలో, ఏడవాలో తెలీని స్థితిలో ఆ మాటలు జోకుల్లా వినిపించాయి.

తర్వాత పరిస్థితి మామూలే!

మళ్లీ పరిశ్రమని తెరిపించడానికీ, ఇతర ప్రభుత్వ సంస్థల్లో మాకు ఉద్యోగాల్ని ఇప్పించడానికి ప్రయత్నిస్తాం అని వాగ్దానాలు చేసిన యూనియన్లు... ఇప్పటికీ అదే ప్రయత్నంలో ఉన్నాయి (ట)?

సెక్రటేరియట్ ముందు టెంట్లేసి ధర్నాలు జరిపాము. నగర వీధుల్లో మా బతుకుల్ని బాగు చెయ్యమని నినాదాల్ని చేస్తూ కాళ్లు అరిగేలా ఊరేగింపుల్లో పాల్గొన్నాము. మా అరుపులు విన్నా విననట్లు ప్రవర్తించసాగించి ప్రభుత్వం.

సమాజంలో ఆర్థికంగా చితికిపోవటంతో అన్ని వైపుల నుండి ఒత్తిడి మొదలయ్యింది. అందరికీ

లోకువే అయ్యాం. మళ్ళీ ఇతర చోట్ల ఉద్యోగాలకై ప్రయత్నిస్తే... చుక్కెదురే అయ్యేది.

"అనామిక బాధితుల్లారా... కొన్నాళ్లు అన్‌పేడ్ ఆపరేటర్స్‌గా చేయండి. తర్వాత జీతం సంగతి ఆలోచిద్దాం" సోమాలియా మనుషుల్లా మమ్మల్ని వ్యంగ్యంగా ట్రీట్ చేయటం మాకు గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్లయ్యేది.

కాలే కడుపుని చేత పట్టుకుని, కుట్టుకున్న పెళ్లాం బిడ్డల్ని పోషించడం ఎలా... ఆలోచనల సుడిగుండంలో అందరం కన్పించే ప్రతి కంపెనీ చుట్టూ తిరిగాము.

భగవాన్ ఏమిటీ శిక్ష!

కర్తలెవరు... కర్మ నెవ రనుభవిస్తున్నారు?

మా కార్మికుల పిల్లలందర్నీ ఊరేగింపుగా తీసుకెళ్లాం ఒక రోజు. చిరు చిరు పాదాలతో, ఎర్రటి ఎండలో, వీధుల్లో... వాడిపోయిన మొహాల్తో గుండెలదిరేలా గొంతు చించుకుంటూ... 'మా నాన్నలకీ, అమ్మలకీ ఉపాధి చూపించండి.

మా కాలే కడుపులకి అన్నం ప్రసాదించండి...' ఆకాశం చిల్లులు పడేలా ఆర్తనాదాలు. మా వేదనని చూస్తున్న ప్రజలు తల్లడిల్లిపోయారు. మా పిల్లల్తో శ్రుతి కలిపి వాళ్లు కూడా ఏడుస్తూ అరచారు. సాయంత్రం దాకా అరచిన గొంతులు ఎండిపోయి, తడారి... శోషతో రోడ్ల మీదే వాడిన పువ్వుల్లా నీరసంగా వాలిపోయాము.

ఆ ఆక్రందనలకి శిలలన్నా కరుగుతాయేమో, ప్రభుత్వం శిలకన్నా కఠినమన్న సత్యం అందరికీ తెలీపర్చుకుంది. ఆ తర్వాత కొన్నాళ్లకి ఓ ప్రైవేట్ సంస్థలో ఓ మోస్తరు ఉద్యోగం దొరికింది నాకు. కొందరు కుల వృత్తులు చేపట్టారు.

మరి కొందరు కూలీలుగా మారారు. వలస పోయిన కార్మికులు దేశాన్ని గాలిస్తున్నారు.

మా సెక్షన్ వాడే అయిన భాస్కర్రావు ఆ మధ్య బస్టాండ్‌లో కన్పించాడు. మనిషి చిరిగిన గుడ్డల్లో, పెరిగిన గడ్డంతో, చింపిరి జుట్టుతో అనామిక ఐడెంటిటీ కార్డ్‌ని అక్కడున్న జనాలకి చూపిస్తూ డబ్బుల్ని అడుక్కోవడం చూసిన నాకు ఆ వేళ అన్నం సహించలేదు.

అతనొకప్పుడు ఎలా బతికాడో నాకు తెలుసు.

కాలం గడుస్తోంది. కన్నీళ్లు ఖర్చవుతూనే ఉన్నాయి. ఖర్చు చేసుకోడానికి డబ్బుల్లేవు మరి. అక్కడక్కడా ఆకలి చావులు జరిగాయని విన్నాను. గుండెలు బండబారి నిర్లిప్తత ఆవహించిన తరుణంలో సూర్యం ఇంత దారుణానికి వడిగడతాడని ఊహించలేదు.

***

"శవాన్ని పాడె పైకి తీసుకురండి" అరుపులు విన్పిస్తున్నాయి. గత వైభవపు గబ్బిలాల కంపు నుండి ఇలలోకి వచ్చాను.

పాడెపైనున్న శవాన్ని నలుగురు కలిసి పైకెత్తారు.

మరమరాల్ని, చిల్లర పైసల్ని చల్లుతున్నారు. మనుషుల కాళ్ల మధ్యలో కప్పపిల్లల్లా గెంతుతూ వాటిని ఏరుకుంటున్నది బిచ్చగాళ్లు కాదు. ఆ అవతారం ఎత్తిన మా కార్మికుల పిల్లలే. దూరంగా ఏదో బహిరంగ సభ తాలూకూ వాగ్దానాలు గాలిలో తేలుతూ నా చెవిలో దూరుతున్నాయి. "స్వయం సమృద్ధి కోసం, నిరుద్యోగ నిర్మూలన కోసం మాకు దగ్గరలో పెద్ద పరిశ్రమను స్థాపించడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది..." ఏ పరిశ్రమల శాఖ మంత్రో... అరుస్తున్నాడు.

శవంతో పాటు అందరం శ్మశానం చేరుకున్నాము.

పశ్చిమాద్రిలో సంధ్యారాగం-రక్తం నింపిన గాజు బంతిలా ఉన్నాడు సూర్యుడు. ●

